RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 202 | ఆగస్టు 23 ఆదివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 202 | August 23 Sunday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యం 2

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు



**నిజామాబాద్ జనసంఘర్షణ**
రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, వాటి పేరుతో ఓట్లు అడిగే ప్రసక్తే లేదని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్ పర్యటనలో భాగంగా ఆయన నగరంలోని పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్లను, మోడల్ హౌసింగ్ టవర్ పనులను పరిశీలించారు. గృహప్రవేశం చేసిన మహిళలకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో పైలట్ ప్రాజెక్ట్‌గా హైదరాబాద్ తరహా ఇందిరమ్మ ఇండ్ల టవర్ల నిర్మాణాన్ని రాబోయే 20 రోజుల్లో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులపై భారం పడకుండా సిమెంట్ పరిశ్రమలతో మాట్లాడి రూ.230 కే బస్తా సిమెంట్ అందించేలా ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో కేవలం 60 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మాత్రమే పూర్తి చేసి, 30 వేల ఇళ్లను మొండిగోడలతో వదిలేసిందని విమర్శించారు. నిజామాబాద్‌లోనే అసంపూర్తిగా ఉన్న 400 ఇళ్లను తమ ప్రజా ప్రభుత్వం నిధులు కేటాయించి పూర్తి చేసి, డ్రా పద్ధతిలో నిరుపేదలకు కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పత్రాలను, మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.3.72 కోట్ల చెక్కులను అందించారు. అనంతరం నూతన తహసీల్దార్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలు మరియు గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ప్రతి జిల్లాలో

➤ మిగతా 2వ పేజిలో..

# విశాఖపట్నంలో బ్రిక్స్ దేశాల క్రీడా మంత్రుల సదస్సు




**విశాఖపట్నం జనసంఘర్షణ**
విశాఖపట్నంలో బ్రిక్స్ దేశాల క్రీడా మంత్రుల సదస్సు ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి హాజరైన విదేశీ ప్రతినిధులు, 11 బ్రిక్స్ దేశాల క్రీడా మంత్రులు కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో కలిసి చారిత్రక ప్రాంతమైన తొట్లకొండ బౌద్ధ క్షేత్రాన్ని సందర్శించారు. అక్కడ మొక్కలు నాటిన అనంతరం తొట్లకొండలోని మహాస్తూపం, బావులు, ధ్యాన కేంద్రాలు మరియు పురావస్తు అవశేషాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు విదేశీ ప్రతినిధులకు అప్పటి బౌద్ధ జీవన విధానం మరియు విశేషాలను వివరంగా తెలియజేశారు. కాగా, ఈ సాయంత్రం ప్రతినిధులకు ఇచ్చే విందు కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా పాల్గొననున్నారు. 'స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే ఇతివృత్తంతో భారత్ అధ్యక్షతన ఈ సమావేశాలు నిర్వహించబడుతున్నాయి. ఈ సదస్సులో విద్య, నైపుణ్యాలు, వ్యవస్థాపకత, సుస్థిరాభివృద్ధి వంటి అంశాలపై సమగ్రంగా చర్చించి ఉమ్మడి ప్రకటనను విడుదల చేయనున్నారు. ఆదివారం నాటి సమావేశాల్లో క్రీడా విధానాలు, సాంకేతిక సహకారం

➤ మిగతా 2వ పేజిలో..

# ట్రంప్‌కు ఎదురుదెబ్బ



**వాషింగ్టన్ జనసంఘర్షణ**
మెరికాలో ఇమ్మిగ్రెంట్ వీసాల ప్రక్రియపై డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం విధించిన నిషేధానికి ఫెడరల్ కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, రష్యా సహా 75 దేశాల పౌరులకు ఉద్దేశించిన ఇమ్మిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఈ ఏడాది జనవరిలో ట్రంప్ సర్కార్ జారీ చేసిన ఆదేశాలను యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి జీనెట్ కొట్టివేశారు. ఈ విధమైన వీసా నిలిపివేత నిర్ణయం ఫెడరల్

# రియాక్టర్ పేలి భారీ ప్రమాదం

## ఇద్దరు మృతి.. పలువురికి గాయాలు



**యాదాద్రి జనసంఘర్షణ**
యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం శివారులోని హేజో లేబొరేటరీస్ కెమికల్ పరిశ్రమలో రియాక్టర్ పేలి భారీ ప్రమాదం జరిగింది. సీ-బ్లాక్‌లో రాత్రి షిఫ్టులో 18 మంది కార్మికులు పనిచేస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో చిన్న నాగిరెడ్డి, నాగన్న బోయిన నరేష్‌కుమార్ అనే ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని

➤ మిగతా 2వ పేజిలో..

# కుప్పకూలిన ఏడంతస్తుల భవనం



**హైదరాబాద్ జనసంఘర్షణ**
గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో నాలాను ఆనుకుని 50 గజాల స్వల్ప విస్తీర్ణంలో అక్రమంగా నిర్మిస్తున్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన రమణారెడ్డి అనే మరొకరిని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రికి తరలించారు. భవనం కూలిన సమయంలో దాని శకలాలు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పై పడటంతో, సమీపంలోని హాస్టల్ విద్యార్థులు భయాందోళనలతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న వెంటనే డీఆర్ఎఫ్ హైడ్రా బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే ఖాజా అనే వ్యక్తి ఈ ప్రమాదకర నిర్మాణాన్ని చేపట్టినట్లు ప్రాథమికంగా గుర్తించారు. గతంలో ఈ అక్రమ నిర్మాణంపై అధికారుల నోటీసులు, పక్క అపార్ట్‌మెంట్ వాసుల ఫిర్యాదులు ఉన్నప్పటికీ, సిబ్బందిని

➤ మిగతా 2వ పేజిలో..

# కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ విద్యావేత్తలతో సమావేశం

**బ్రిటన్ జనసంఘర్షణ**
తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలు మరియు స్టార్టప్ రంగాలు మరింత పురోగమించేలా హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లను అందుబాటులోకి తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం విదేశీ పర్యటనలో భాగంగా బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ విద్యావేత్తలతో సమావేశమైంది. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి విజ్ఞాన, పరిశోధనా హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సాగిన ఈ చర్చల్లో ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు జయేష్ రంజన్, రామకృష్ణారావులతో పాటు కేంబ్రిడ్జ్ ప్రతినిధులు ప్రొఫెసర్ జయదీప్ ప్రభు, వెంకట శిరీష్ గండికోట పాల్గొన్నారు. హైదరాబాద్‌లో ఉన్న మానవ వనరులు, సాంకేతిక అభివృద్ధి మరియు పరిశ్రమల వాతావరణాన్ని

➤ మిగతా 2వ పేజిలో..

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**మొదటిపేజీ తరువాయి..** 70 గ్రామాల చొప్పున భూముల సర్వే వేగంగా జరుగుతోందని, భవిష్యత్తులో వివాదాలు లేని స్థలాలను పేదలకు కేటాయిస్తామని స్పష్టం చేశారు.

# ట్రంప్‌కు ఎదురుదెబ్బ

**మొదటిపేజీ తరువాయి..** వలస చట్ట నిబంధనలకు స్పష్టంగా విరుద్ధంగా ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. వలస వీసాల మంజూరు వ్యవహారాల్లో కాన్సులర్ అధికారుల స్వతంత్ర విధులకు సంబంధించిన అధికారాలను విదేశాంగ కార్యదర్శి దాటి వ్యవహరించలేరని, బాధ్యతగల విదేశీ పౌరులకు వీసాలు నిలిపివేసే చట్టబద్ధమైన హక్కు ప్రభుత్వానికి లేదని కోర్టు స్పష్టం చేసింది. అంతకుముందు, ఈ 75 దేశాలకు చెందిన నివాసితులు అమెరికా సంక్షేమ పథకాలను, ఫలితాలను పరిమితికి మించి పొందుతున్నారని ట్రంప్ ప్రభుత్వం వాదించింది. క్రొత్తగా వచ్చే వలసదారులు అమెరికన్ల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించకుండా రక్షణ కల్పించడమే తమ ప్రాథమ్యమని, వారు దేశానికి భారం కాదని నిర్ధారణ అయ్యే వరకు ఈ నిలిపివేత కొనసాగుతుందని విదేశాంగ శాఖ గతంలో ప్రకటించింది. అయితే కోర్టు తీర్పుతో ట్రంప్ సర్కార్ తీసుకున్న ఈ వీసా నిషేధ నిర్ణయం చెల్లకుండా పోయింది.

# పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యం

హైదరాబాద్
తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో అత్యంత పోటీతత్వం కలిగిన పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో జరిగిన 'గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అండ్ లీడర్‌షిప్ కాన్క్లేవ్-2026'లో పాల్గొన్న ఆయన, నైపుణ్యమున్న మానవ వనరులు, ప్రపంచస్థాయి మౌలిక వసతులు మరియు పారదర్శక పాలన అనే నాలుగు స్తంభాలపై రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నిలిచి ఉందని పేర్కొన్నారు. 2025-26 నాటికి తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (+ూణ్గూ) సుమారు రూ.17.82 లక్షల కోట్లకు చేరుకుంటుందని, జాతీయ వృద్ధి రేటు 8 శాతంతో పోలిస్తే రాష్ట్రం 10.7 శాతం వృద్ధి నమోదు చేయడం ఇక్కడి ఆర్థిక శక్తికి నిదర్శనమని వివరించారు.
ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్-2047' దార్శనిక ప్రణాళికలో భాగంగా 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఉత్తమ్ తెలిపారు. అభివృద్ధి కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలకు, గ్రామాలకు విస్తరించాలనే ఉద్దేశంతో రాష్ట్రాన్ని అర్బన్, పరిసర ప్రాంతాల, గ్రామీణ ఆర్థిక మండలాలుగా విభజించినట్లు చెప్పారు. ఐటీ, బయోటెక్నాలజీలతో పాటు సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్ రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి ద్వితీయ శ్రేణి నగరాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. అలాగే సాగునీటి రంగంలో ఏఐ, డ్రోన్లు వంటి ఆధునిక సాంకేతికతను ప్రోత్సహిస్తూ, ఫుడ్ ప్రాసెసింగ్ మరియు అగ్రి-లాజిస్టిక్స్ రంగాలు గ్రామీణ యువతకు ఉపాధి కల్పిస్తాయని స్పష్టం చేశారు.

## 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు

### భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్

**హైదరాబాద్** రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వేలాది ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి దండుకోగా.. కాంగ్రెస్ హయాంలో అది లక్షలాది ఎకరాలకు చేరిందని విమర్శించారు. హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాత్రికి రాత్రే ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో పెట్టి ప్రభుత్వం వేధిస్తోంది. దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తున్న భూములను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారు? ప్రజల వ్యతిరేకతను తప్పించుకోవడం కోసం సీఎం ఇంటిని నిషేధిత జాబితాలో చేర్చారా? ధరణి స్థానంలో వచ్చిన భూభారతి నవ్వులపాలైంది. బీఆర్ఎస్ 10శాతం కమిషన్ తీసుకుంటే.. కాంగ్రెస్ 30 శాతం తీసుకుంటోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఓపెన్ భూములను అమ్మాలని చూస్తున్నారు. ప్రైవేటు భూముల్లో 50శాతం కమిషన్ అడుగుతున్నారు. ప్రభుత్వ భూముల్ని ఎందుకు అమ్ముతున్నారో సమాధానం చెప్పాలి. రియల్ ఎస్టేట్ కంపెనీలను బెదిరించి వాటాలు తీసుకుంటున్నారు. భాజపా అధికారంలోకి వచ్చాక ఈ భూములపై మళ్లీ పరిశీలన చేస్తాం. ఎమ్మెల్యేకు ఇష్టంలేకపోతే ఆ భూమి 22ఏలోకి వెళ్లిపోతుంది. ఈ భూముల విషయంలో భాజపా లీగల్ సెల్ ప్రజలకు సహాయం అందిస్తోంది. ప్రాముఖ్యతను బట్టి ముఖ్యమంత్రికి విదేశీ పర్యటనలకు అనుమతులు ఇస్తారు.

# విశాఖపట్నంలో బ్రిక్స్ దేశాల క్రీడా మంత్రుల సదస్సు

**మొదటిపేజీ తరువాయి..** మరియు క్రీడా పరికరాల తయారీపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. కేంద్ర క్రీడల సహాయ మంత్రి రక్షా ఖడ్సే ముగింపు వేడుకల్లో ప్రసంగించనుండగా, అనంతరం 11 బ్రిక్స్ దేశాల ప్రతినిధులు ఉమ్మడి ప్రకటనకు ఆమోదం తెలుపనున్నారు.

# రియాక్టర్ పేలి భారీ ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి..** మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. పేలుడు ధాటికి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడమే కాకుండా, ఆ శబ్దానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న చౌటుప్పల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే, నెల రోజులు తిరగకముందే అదే పరిశ్రమలో మరో ప్రమాదం జరగడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత జూలై 16న విషవాయువు పీల్చి కృష్ణారెడ్డి అనే కార్మికుడు మృతి చెందిన విషయాన్ని గుర్తుచేస్తూ, యాజమాన్యం సరైన భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా పరిశ్రమ నుంచి వస్తున్న తీవ్రమైన రసాయన దుర్వాసనల వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు తలనొప్పి, వాంతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపాలని డిమాండ్ చేస్తున్నారు.

## మీడియా అకాడమీ కార్యకలాపాలు అభినందనీయం

### ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రశంసలు

**హైదరాబాద్ :** జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి నైపుణ్యాల పెంపు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు తెలంగాణ మీడియా అకాడమీ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని దేశంలోని పలు రాష్ట్రాలతో ఏర్పడ్డ ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులు ప్రశంసించారు. ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధి బృందం శనివారం మధ్యాహ్నం తెలంగాణ మీడియా అకాడమీ భవనాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ప్రతినిధులకు అకాడమీ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు, జర్నలిస్టుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అకాడమీ కార్యదర్శి నాగుళ్లపల్లి వెంకటేశ్వరరావు ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. సందర్భంగా జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అక్రిడిటేషన్ సేవలు, విధి నిర్వహణలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అందిస్తున్న రూ.1 లక్ష ఆర్థిక సహాయం, వారి పిల్లలకు అందిస్తున్న ట్యూషన్ ఫీజు సహాయం, అలాగే జర్నలిస్టు
కుటుంబాలకు అందిస్తున్న ఇతర సంక్షేమ కార్యక్రమాలను ప్రతినిధులకు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం డెస్క్ జర్నలిస్టులకు కూడా అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తుండటం పట్ల ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులందరూ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 23,000 మందికి పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేస్తూ, జర్నలిస్టుల వృత్తిపరమైన గుర్తింపు మరియు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అభినందించారు. రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీలు, అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులు ఒక వినతిపత్రాన్ని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీ కె. శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. జర్నలిస్టుల సమస్యలను పరిశీలించి, వాటిని సంబంధిత ఎంపీలు మరియు అన్ని రాజకీయ పార్టీల దృష్టికి తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అదేవిధంగా జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు, వర్క్‌షాపులు, అవగాహనా కార్యక్రమాల గురించి వివరించారు. శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనే జర్నలిస్టులకు ఉపయోగపడేలా అకాడమీ ప్రచురిస్తున్న మోనోగ్రాఫ్లు, పుస్తకాలు అందిస్తున్న విధానాన్ని కూడా ప్రతినిధులు పరిశీలించారు.
÷ఖడియా అకాడమీ కోసం నిర్మించిన ఆధునిక సౌకర్యాలతో కూడిన ఐదు అంతస్తుల భవనం, శిక్షణా తరగతులు, గ్రంథాలయం, కంప్యూటర్ సౌకర్యాలు, సమావేశ మందిరం, 250 మంది సామర్థ్యం కలిగిన సెంట్రల్ ఏసీ ఆడిటోరియం తదితర సౌకర్యాలను ప్రతినిధి బృందం సందర్శించింది. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఇంతటి సమగ్ర మౌలిక వసతులతో అకాడమీ పనిచేయడం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు.
÷రిత్తగా ఏర్పడిన ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ కేవలం మరో సంస్థగా కాకుండా దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తి ప్రమాణాలు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు బలమైన వేదికగా ఎదగాలని ప్రతినిధులు ఆకాంక్షించారు. జర్నలిస్టుల ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఫెడరేషన్ మరింత క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. మీడియా అకాడమీ ఆఫ్ తెలంగాణ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని, ముఖ్యంగా జర్నలిస్టుల సంక్షేమం మరియు శిక్షణ రంగాల్లో అకాడమీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఫెడరేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు ప్రతినిధి బృందానికి అకాడమీ కార్యకలాపాలు, సంక్షేమ కార్యక్రమాలపై వివరాలు అందించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్బ్కు చెందిన నీలేష్ కాంతాహా, హారీష్ పగిడే, సంజయ్ మహతా (మధ్యప్రదేశ్), సోనాలి యాదవ్, దీపక్ మహేశ్వరీ, ఉదిత్ తండ్, ఉమాలీ తండ్, లక్షణ్ ఫండ్, యాష్ వర్ధన్ సింగ్, రచనా జోషి, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రెసిడెంట్ గౌతమ్ పహాని, డా. స్నేహాశిస్ సూర్, జనరల్ సెక్రటరీ సౌరభ్ దుగ్గల్, మెంబర్ అనిల్ సింగ్,

# కుప్పకూలిన ఏడంతస్తుల భవనం

**మొదటిపేజీ తరువాయి..** మచ్చిక చేసుకుని నిర్మాణం కొనసాగించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండేళ్ల క్రితం కూడా ఇదే అంజయ్య నగర్‌లో ఐదు అంతస్తుల భవనం ఒరిగిపోయిన ఘటనను గుర్తుచేస్తూ, వరుసగా జరుగుతున్న ఇటువంటి ప్రమాదాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ విద్యావేత్తలతో సమావేశం

**మొదటిపేజీ తరువాయి..** వివరించిన రాష్ట్ర బృందం, అంతర్జాతీయ స్థాయి విద్యా కోర్సులు, సంయుక్త పరిశోధనలు, ఇంక్యుబేషన్ కార్యక్రమాలు మరియు యువ పారిశ్రామికవేత్తలకు మార్గదర్శకత్వం వహించడంలో కేంబ్రిడ్జ్ వర్సిటీతో ఒప్పందాలకు భాగస్వామ్యం ఆహ్వానించింది. ఇందుకు సానుకూలంగా స్పందించిన కేంబ్రిడ్జ్ ప్రతినిధులు, స్థానిక యువతకు అంతర్జాతీయ అవకాశాలు కల్పించే దిశగా ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి భాగస్వామ్యాన్ని ఆచరణలోకి తీసుకురావడానికి అంగీకారం తెలిపారు.

# 'యంగ్ ఫిల్మ్ మేకర్ ఛాలెంజ్ 2026 - సీజన్ 2'

హైదరాబాద్
తెలంగాణ సంస్కృతి, పండుగలను ప్రతిబింబించేలా తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (FDC) ఆధ్వర్యంలో 'యంగ్ ఫిల్మ్ మేకర్ ఛాలెంజ్ 2026 - సీజన్ 2' పోటీలను నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా మరియు ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, బతుకమ్మ పండుగ, కళారూపాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై షార్ట్ ఫిలింలు, పాటల పోటీలు నిర్వహించనున్నారు. ఈ సారి కొత్తగా జానపద పాటలు, ఇన్‌ఫ్లుయెన్సర్ల వీడియోలు మరియు వ్యాసాలకు (ఆర్టికల్స్) కూడా అవకాశం కల్పించారు.

యువ ప్రతిభావంతులకు సినీ రంగంలో అవకాశాలు కల్పించడంతో పాటు సృజనాత్మకతకు ఈ వేదిక దోహదపడుతుందని క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే లఘు చిత్రాల నిడివి 3 నిమిషాలు, పాటలు 5 నిమిషాలకు మించకూడదని, వీడియోలు 4ఖ రిజల్యూషన్‌లో ఉండాలని సూచించారు. ఆసక్తి గల వారు తమ ఎంట్రీలను 2026 సెప్టెంబర్ 15 నాటికి ఇమెయిల్ ద్వారా లేదా 8125834009 వాట్సాప్ నంబరుకు పంపాల్సి ఉంటుంది. నిపుణులైన జ్యూరీ ఎంపిక చేసే విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 3 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ. 2 లక్షలు, తృతీయ బహుమతిగా రూ. 1 లక్ష నగదును అందజేస్తారు. మరో ఐదుగురికి రూ. 20 వేల చొప్పున కన్సోలేషన్ బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేయనున్నారు.

# పవర్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన భట్టి

### ఆధునికత సాంకేతికతపై ప్రదర్శన

**హైదరాబాద్ :** నగరంలోని నెక్లెస్ రోడ్‌లో పీపుల్స్ ప్లాజాలో పవర్ ఎగ్జిబిషన్-2026 ఘనంగా ప్రారంభమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో విద్యుత్ రంగంలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికతల ను ప్రదర్శిస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, వినియోగంలో చోటుచేసుకుంటున్న సాంకేతిక మార్పులను ప్రజలకు పరిచయం చేయడం ఈ ఎగ్జిబిషన్ ప్రధాన ఉద్దేశంగా ఉంది. ఎగ్జిబిషన్‌లో విద్యుత్ భద్రతా చర్యలు, పునరుత్పాదక ఇంధన వనరులకు సంబంధించిన ప్రత్యేక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. స్మార్ట్ మీటరింగ్, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ఛార్జింగ్ వ్యవస్థలు వంటి నూతన సాంకేతికతలపై సందర్శకులకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలను ప్రజలు ప్రత్యక్షంగా తెలుసుకునేలా ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నారు.

# జీవో 97ని రద్దు చేయాలని బిఆర్ఎస్ యువజన విభాగం నిరసన

- కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాలని మార్చుకోవాలి
- బిఆర్ఎస్ యూత్ అధ్యక్ష కార్యదర్శులు అంబోజి సతీష్, కుప్పల నిరంజన్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 22(జనసంఘర్షణ):
చర్ల మండల కేంద్రంలో జిఓ నంబర్ 97 నీ రద్దు చేయాలి, అని జిల్లా అధ్యక్షులు రేగ కాంతారావు పిలుపు మేరకు నియోజకవర్గ ఇంచార్జి రావులపల్లి రాంప్రసాద్, మాజీ ఇంచార్జ్ మానె రామకృష్ణ, మండల కన్వీనర్ దొడ్డి తాతారావు నియోజకవర్గ యువజన నాయకులు కాకి అనిల్, సూచనలతో బిఆర్ఎస్ పార్టీ చర్ల మండల యువజన విభాగం అధ్యక్ష కార్యదర్శులు అంబోజి సతీష్, కుప్పల నిరంజన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి ఎమ్మార్వో కి వినతిపత్రం అందించడం జరిగింది. "జీవో 97" వలన రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను, ఐటీఐలను, అప్రెంటిస్ శిక్షణా కేంద్రాలను "యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ" (వై ఐ ఎస్ యు )పరిధిలోకి కొత్తగా ఏర్పాటు చేసిన 'శక్తి' శాఖ కిందకు మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందనీ,ఈ నిర్ణయం వల్ల ఉన్నత విద్యా అవకాశాలు దెబ్బ తింటాయనీ. పాలిటెక్నిక్ పూర్తయ్యాక విద్యార్థులు ఈసెట్ పరీక్ష ద్వారా నేరుగా బీటెక్ (బి .టెక్ ) సెకండ్ ఇయర్‌లో చేరే అవకాశం ఉందనీ. ఈ కొత్త విలీనం వల్ల ఆ లాటరల్ ఎంట్రీ విధానం రద్దవుతుందనీ ఈ సందర్భంగా తెలియజేశారు. స్కిల్ యూనివర్సిటీ పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్ మోడల్‌లో నడుస్తుందనీ దీనివల్ల ఫీజులు విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందకుండా పోతాయన్నారు. సాంకేతిక విద్యను అందించే పాలిటెక్నిక్ వ్యవస్థను లేబర్, స్కిల్లింగ్ (శక్తి ) పరిధిలోకి తీసుకురావడం వల్ల విద్యార్థులను కేవలం "రెడీ–టు–మాన్‌పవర్" లేదా ఫ్యాక్టరీ కార్మికులుగా మార్చే ప్రమాదం ఏర్పడుతుందని, విద్యార్థులకు నష్టం కలిగించే ఈ జీవోను తక్షణమే రద్దు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. లేనియెడల బిఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల తరఫున పలు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాము. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, ఆర్ కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవి, పాకలపాటి సత్యనారాయణ రాజు, బొజ్జ ప్రణయ్, పంజా రాజు, మామిడి రాజు ఎస్సీ సెల్ అధ్యక్షులు కొంబత్తిని. రాంబాబు, ఉప సర్పంచ్ ఎడ్ల రామదాసు, బీసీ సెల్ అధ్యక్షులు గోరెంట్ల. వెంకటేశ్వర్లు, తడికల చంద్రశేఖర్, యువజన నాయకులు: సృజన్, ప్రేమ్, కృష్ణంరాజు, వంశి, సాగర్, నితీష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.



# రూపారెడ్డి హత్యకు నిరసన.. ఉపాధ్యాయుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి

- కోటగిరిలో శ్రీ వేద పాఠశాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, రాస్తారోకో..
- ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్

కోటగిరి/, ఆగస్టు 22/ (జన సంఘర్షణ):
నల్గొండ జిల్లాలో నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డి దారుణ హత్యకు నిరసనగా కోటగిరి మండల కేంద్రంలో శ్రీ వేద పాఠశాల ఆధ్వర్యంలో శనివారం భారీ నిరసన ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. పాఠశాల నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ప్లకార్డులు చేతబట్టి ర్యాలీ నిర్వహించిన అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. "ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి.. రూపారెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి" అంటూ నినాదాలు చేశారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, వారిలో క్రమశిక్షణను పెంపొందించే ఉపాధ్యాయులపై దాడులు, హత్యలు జరగడం ఆందోళనకరమని నిరసనకారులు పేర్కొన్నారు. విద్యార్థుల క్రమశిక్షణ కోసం ఉపాధ్యాయులు తీసుకునే చర్యలను తల్లిదండ్రులు సానుకూలంగా అర్థం చేసుకోవాలని, చిన్నపాటి విభేదాలను కక్షలుగా మార్చుకుని ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం సమాజానికి ప్రమాదకరమని హెచ్చరించారు.

**ఉపాధ్యాయులకు భద్రత కల్పించాలి...**

ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు భద్రత కల్పించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై దాడులు పునరావృతం కాకుండా ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ఉపాధ్యాయుల గౌరవం, భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో మరింత పెద్దస్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రూపారెడ్డి కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించి, కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. ఉపాధ్యాయుల భద్రతపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తెల్ల అక్షర, ఉపాధ్యాయులు సాయి, పవన్, సాయినాథ్, నాగరాజు, రాము, రమేష్, భీమ్రావు, నఫీజ్, చంద్రకళ, సంగీత, పూజ, సుప్రియ, గంగాసాగరి తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.






# సరిహద్దుల్లో సేవ.. స్వగ్రామంలో ఘన సన్మానం...

- దేశ సేవలో సైనికుల త్యాగాలు ఆదర్శనీయం
- సర్పంచ్ ఉదయ్ భాస్కర్, తోటి మిత్రులు టెన్త్ క్లాస్ మిత్రబృందం సన్మానం

పోతంగల్/ ఆగస్టు 22/ జన సంఘర్షణ
దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తూ మాతృభూమికి సేవలందిస్తున్న ఆర్మీ జవాన్ గౌడుగు గంగాధర్‌కు స్వగ్రామమైన హంగర్గలో శనివారం ఘన సన్మానం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ఉదయ్ భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు, ప్రజాప్రతినిధులు జవాన్‌కు ఆత్మీయ స్వాగతం పలికి పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం కుటుంబాలకు దూరంగా ఉంటూ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న సైనికుల సేవలు అభినందనీయమన్నారు. దేశ భద్రత కోసం సైనికులు చేస్తున్న త్యాగాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. తన చిన్ననాటి స్నేహితుడైన గంగాధర్‌తో కలిసి ఒకే పాఠశాలలో చదువుకున్న రోజులను, ఆటపాటల జ్ఞాపకాలను సర్పంచ్ గుర్తుచేసుకున్నారు. చిన్ననాటి స్నేహితుడు దేశ సేవ కోసం సరిహద్దుల్లో విధులు నిర్వహించి గ్రామానికి రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. సైనికులు సరిహద్దుల్లో అప్రమత్తంగా కాపలా కాస్తున్నందువల్లే దేశ ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. దేశానికి సేవ చేస్తున్న ప్రతి జవాన్‌కు కోటి వందనాలు చేసినా తక్కువేనని అన్నారు.

**గ్రామ ఐక్యతకు పిలుపు....**

అనంతరం ఆర్మీ జవాన్ గంగాధర్ మాట్లాడుతూ.. తాను చదువుకునే రోజుల్లో పోతంగల్‌లోని సినిమా థియేటర్‌కు సినిమాలు చూసేందుకు వెళ్లిన సందర్భంలో పోతంగల్ గ్రామస్థులతో జరిగిన చిన్ననాటి సంఘటనలను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో గ్రామస్థులంతా ఏకతాటిపై నిలిచి ఉండేవారని, అదే ఐక్యతను నేటికీ కొనసాగించాలని కోరారు. తన సేవలను గుర్తించి గ్రామస్థులు ఘనంగా సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దేశానికి సేవ చేయడం తనకు గర్వకారణమని, దేశ సేవ కోసం తనను పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులకు పాదాభివందనం చేస్తున్నానని తెలిపారు. గ్రామంలో ఎవరికైనా తన వంతు సహాయ సహకారం అవసరమైతే ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

**97 మంది విద్యార్థులకు దుస్తుల పంపిణీ....**

ఈ సందర్భంగా గ్రామంలోని పాఠశాలలో చదువుతున్న 97 మంది విద్యార్థినీ, విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు... దేశ సేవతో పాటు గ్రామాభివృద్ధి, విద్యార్థుల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని జవాన్ గంగాధర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ అధ్యక్షుడు నిరడి గంగాధర్, గోవింద్, సుభాష్, ఈరుగొండ, బాల్యమిత్రులు గంధపు దత్తు, అశోక్, నవీన్, నాగేష్ తదితర గ్రామ పెద్దలు, యువత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జవాన్ గంగాధర్‌ను మరోసారి అభినందించి, దేశ సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.





# సిపిఐ అగ్ర నేత మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రథమ వర్ధంతి

- మాజీ పార్ల మెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి.
- చర్లలో ఘనంగా నిర్వహించడం జరిగింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 22(జనసంఘర్షణ):
చర్ల మండలం లోని స్థానిక సిపిఐ కార్యలయం లో సిపిఐ అగ్ర నేత, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్ల మెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి గణమైన నివాళులు అర్పించి పుష్పాంజలి ఘటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ మాట్లాడుతూ.. సురవరం సుధాకర్ రెడ్డి,విలువలకు నిలువుటద్దం ప్రజా పోరాటాలకు ప్రతి రూపం అన్నారు. ఆయన విద్యార్థి దశ నుంచి పోరాట బాట పట్టి.ఏ ఐ ఎస్ ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఏ ఐ ఎస్ ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా, ఏ ఐ వై ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు, పార్లమెంట్ సభ్యులుగా, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఉద్యమ రథసారథి అన్నారు. విద్యార్థులు యువత రైతులు కార్మికులు పేదల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత కమ్యూనిస్టు నాయకుడు అన్నారు. ఆయన పదవుల కోసం కాదు ప్రజల కోసం జీవించిన నాయకుడు, ఆయన ఆశయాలను విలువలు చిరస్మరణీయం, అని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్ల మండలం సహాయ కార్యదర్శి కోటి ముత్యాలరావు, కోడి రెక్కల రాజారావు, మునిగల రామారావు, ఆంద్రూ వామనరావు, నరసింహరావు,మోడెమ ఆదినారాయణ, కూసం దుర్గాప్రసాద్, సత్యనారాయణ, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

- డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాచలం నియోజకవర్గం, ఆగష్టు, 22(జనసంఘర్షణ):
భద్రాచలం ఏరియా హాస్పిటల్‌లో పోస్టుమార్టం నిమిత్తం ఉంచిన నడికుడి గ్రామానికి చెందిన కురుసం వెంకటరమణ పార్థివదేహాన్ని, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సందర్శించి నివాళులర్పించారు. నిన్న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ మనోధైర్యం కల్పించారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అన్నెం సత్యనారాయణమూర్తి సత్యాలు, తదితరులు పాల్గొన్నారు.





# క్రమశిక్షణకు పరేడ్ ప్రతీక

- పోలీసు సిబ్బంది ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి.
- గౌరవ వందనం స్వీకరించిన డీఎస్పీ ప్రసన్న కుమార్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 22 (జన సంఘర్షణ)





పోలీసు శాఖలో క్రమశిక్షణ, సమన్వయం, సమయ పాలనకు పరేడ్ ఎంతో కీలకమని మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన పోలీసు పరేడ్‌కు ఆయన హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పరేడ్‌ను పరిశీలించి సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండటంతో పాటు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం అవసరమన్నారు. పరేడ్‌లో పాల్గొనడం ద్వారా సిబ్బందిలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సమన్వయ భావన పెంపొందుతాయని తెలిపారు. విధి నిర్వహణలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కొనేలా సిబ్బంది ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలతో మర్యాదగా మెలుగుతూ వారి సమస్యలను తెలుసుకుని చట్టపరంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,ప్రతిరోజూ వ్యాయామం,పరేడ్ వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని తెలిపారు. అనంతరం పరేడ్‌లో పాల్గొన్న సిబ్బంది కవాతు, డ్రిల్, యూనిఫాం నిర్వహణ, క్రమశిక్షణ తదితర అంశాలను డీఎస్పీ పరిశీలించారు.విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మెదక్ టౌన్ సీఐ మహేష్, ఆర్ఐలు శైలందర్, రామకృష్ణ, ఎస్ఐలు,ఏఆర్ సిబ్బంది, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# చెక్‌పోస్టులు ఉన్నా.. చెక్ ఎక్కడ?

- చిన్న వాహనాలకే కేసులా?..
- పెద్ద వాహనాలకు 'గ్రీన్ సిగ్నల్‌నా?'

**బోధన్, ఆగస్టు 22 (జనసంఘర్షణ):**
బోధన్ సరిహద్దు ప్రాంతాల్లో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ఆరోపణలు పెరుగుతున్నాయి. రాత్రివేళల్లో పీడీఎస్ బియ్యాన్ని వాహనాల్లో మహారాష్ట్రకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఉన్నప్పటికీ అక్రమ రవాణాపై సమర్థవంతమైన నిఘా ఎందుకు కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చెక్‌పోస్టుల వద్ద చిన్న వాహనాలను తనిఖీ చేసి కేసులు నమోదు చేస్తున్నారనే ప్రచారం ఉండగా, భారీ వాహనాల రాకపోకలపై మాత్రం అదే స్థాయిలో తనిఖీలు జరుగుతున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "చిన్న వాహనాలకే నిబంధనలు.. పెద్ద వాహనాలకు గ్రీన్ సిగ్నల్‌నా?" అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**చెక్‌పోస్టుల పనితీరుపై నిఘా అవసరం**

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై వస్తున్న ఆరోపణలను అధికారులు సీరియస్‌గా తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలను ముమ్మరం చేసి, అనుమానాస్పద వాహనాల రాకపోకలను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరుపై ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, అక్రమ రవాణాపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.




**జనసంఘర్షణ చెక్‌పోస్టు:** పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై వస్తున్న ఆరోపణలపై సంబంధిత శాఖల అధికారుల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది. ఆరోపణల్లో వాస్తవం తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఆల్ప్రాజోలం అక్రమ రవాణాదారులపై నిజామాబాద్ పోలీసుల ఉక్కుపాదం

- డ్రగ్ అక్రమ రవాణాతో సంపాదించిన రూ.5.15 కోట్ల ఆస్తులు జప్తు
- అంతర్రాష్ట్ర తయారీ, సరఫరా నెట్‌వర్క్‌పై పకడ్బందీ దర్యాప్తు

**బోధన్, ఆగస్టు 22 (జన సంఘర్షణ)**
ఆల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాల అక్రమ తయారీ, రవాణా, సరఫరా, విక్రయాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాపై నిజామాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. డ్రగ్ అక్రమ వ్యాపారం ద్వారా నిందితులు కూడబెట్టిన సుమారు రూ. 5.15 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు బోధన్ ఏసీపీ పి. శ్రీనివాస్ పర్యవేక్షణలో బోధన్ రూరల్ సీఐ డి. విజయ్ బాబు ఆధ్వర్యంలో చేపట్టిన దర్యాప్తులో అంతర్రాష్ట్ర ఆల్ప్రాజోలం తయారీ, సరఫరా నెట్‌వర్క్‌ను గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు.



**ఐదుగురు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్**

బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆల్ప్రాజోలం తయారీ, సరఫరాకు పాల్పడుతున్న ఐదుగురిపై గతంలో Cr.No.148/2025 కింద చీఎన్డీపీఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు 2.5 కిలోల ఆల్ప్రాజోలం, రూ. 25 లక్షల విలువైన మత్తు పదార్థం, స్కోడా కారు, ఎనిమిది మొబైల్ ఫోన్లు, రూ. 2.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

**మహారాష్ట్రలో అక్రమ తయారీ కేంద్రం**

నిందితులను పోలీస్ కస్టడీలో విచారించగా ఆల్ప్రాజోలం తయారీ, సరఫరాకు సంబంధించిన కీలక సమాచారం లభించింది. దీంతో సుమారు 15 మంది పోలీసులతో ప్రత్యేక బృందాన్ని మహారాష్ట్రకు పంపి వారం రోజుల పాటు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో సతారా పారిశ్రామిక ప్రాంతంలో 'సూర్య ప్రభ ఫార్మా కెమ్' పేరుతో ఎరువుల తయారీకి అనుమతులు తీసుకుని, అక్రమంగా ఆల్ప్రాజోలం తయారు చేస్తున్న ఫ్యాక్టరీని గుర్తించారు. అక్కడ సోదాలు నిర్వహించి సుమారు 30 కిలోల ఆల్ప్రాజోలం, రూ. 12 లక్షల నగదు, ఫోర్డ్ కారును స్వాధీనం చేసుకుని ఫ్యాక్టరీని సీజ్ చేశారు.

**రూ.5.15 కోట్ల ఆస్తులపై జప్తు**

డ్రగ్ అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించడంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మహారాష్ట్రలోని పూణే, సతారా, అహ్మద్‌నగర్ జిల్లాల్లోని సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాల నుంచి వివరాలు సేకరించి నిందితులు, వారి కుటుంబ సభ్యుల ఆస్తులను గుర్తించారు. ఏ1 ఆమర్‌సింగ్, ఏ2 బసవరాజ్, ఏ5 లక్ష్మణ్ గౌడ్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు డ్రగ్ అక్రమ విక్రయాల ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ విలువల ప్రకారం వీటి విలువ సుమారు రూ. 5.15 కోట్లు కాగా, బహిరంగ మార్కెట్‌లో విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. NDPS చట్టంలోని సెక్షన్ 68F(2) ప్రకారం సంబంధిత కాంపిటెంట్ అథారిటీల ఆదేశాలతో ఆస్తుల జప్తు చర్యలు చేపట్టారు. జప్తు చేసిన ఆస్తుల్లో 9.06 ఎకరాల వ్యవసాయ భూమి, 1,370 చదరపు గజాల ఖాళీ స్థలాలు, ఒక కెమికల్ ఫ్యాక్టరీ, నాలుగు నాలుగు చక్రాల వాహనాలు, రెండు ద్విచక్ర వాహనాలు, బ్యాంకు ఖాతాల్లోని సుమారు రూ. 27 లక్షల నగదు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

**సాంకేతిక పరిజ్ఞానంతో కీలక ఆధారాలు**

కేసు దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించిన పోలీసులు నేరంతో సంబంధం ఉన్న సుమారు 20 మంది వ్యక్తుల మొబైల్ ఫోన్ సమాచారాన్ని విశ్లేషించారు. ఈ ఆధారాలతో డ్రగ్ తయారీ కేంద్రం, సరఫరా నెట్‌వర్క్‌తో పాటు అక్రమంగా కూడబెట్టిన ఆస్తులను గుర్తించారు. దర్యాప్తు, న్యాయపరమైన ప్రక్రియ సుమారు ఏడాది పాటు కొనసాగినట్లు పోలీసులు తెలిపారు. డ్రగ్ ముఠాను ఛేదించడం నుంచి అక్రమ ఆస్తుల జప్తు వరకు సుమారు 15 మంది పోలీసు సిబ్బంది నిరంతరం కృషి చేశారని సీపీ పేర్కొన్నారు.

**డ్రగ్ మాఫియాపై ఆర్థిక దెబ్బ**

డ్రగ్ నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు, మాదకద్రవ్యాల ద్వారా అక్రమంగా సంపాదించిన ఆస్తులను గుర్తించి జప్తు చేయడం ద్వారా డ్రగ్ మాఫియాపై ఆర్థికంగా కూడా గట్టి దెబ్బ కొట్టేలా చర్యలు కొనసాగిస్తామని సీపీ సాయి చైతన్య తెలిపారు. మాదకద్రవ్యాల తయారీ, కొనుగోలు, రవాణా, నిల్వ, పంపిణీ, విక్రయాలు, ఆర్థిక లావాదేవీలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, అంతర్రాష్ట్ర పోలీసుల సమన్వయంతో దర్యాప్తును మరింత విస్తృతం చేస్తామని వెల్లడించారు. ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన బోధన్ రూరల్ సీఐ డి. విజయ్ బాబు, పోలీసు సిబ్బందిని సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

**యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి**

యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీపీ సాయి చైతన్య సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. డ్రగ్స్ అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డ్రగ్ నెట్‌వర్క్‌ల నిర్మూలనకు, ముఖ్యంగా యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రజల సహకారం అత్యంత కీలకమని సీపీ పేర్కొన్నారు.

## మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డికి వివాహ ఆహ్వానం

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 22 (జన సంఘర్షణ)**



మెదక్ పట్టణంలోని ద్వారకానగర్ కాలనీకి చెందిన సాయినేని సునీల్‌రావు ప్రసన్న దంపతుల కుమార్తె అభిజ్ఞ వివాహం సతీష్‌రావుతో ఈ నెల 26న కొంపల్లిలోని హైందవ నిమంత్రణ్‌లో జరగనుంది. ఈ సందర్భంగా శనివారం మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్,మాజీ కౌన్సిలర్ ఆర్.కె. శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు ప్రభురెడ్డి తదితరులు ఉన్నారు.

## చర్ల మండల టిఎజిఎస్ మహాసభను జయప్రదం చేయండి

- తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కారం నరేష్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్ల మండలం, ఆగస్టు 22(జనసంఘర్షణ):**



తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం 9వ మండల మహాసభ ను చర్ల బియస్ రామయ్య భవన్ నందు ఈ నెల 26 వ తెదిన జరుగుతుందని, జిల్లా సహయ కార్యదర్శి కారం నరేష్ పిలుపునిచ్చారు, ఆదివాసి చట్టాలు, హక్కులు రక్షణ కై నడుం బిగించాని, జివో నెంబర్ 3 పునరుద్దరణ చెయాలని, ఈ మహసభ ద్వార ఆదివాసి భవిష్యత్తు కర్తవ్యాలు తీర్మానం ద్వారా మహాసభలో వేదిక కానున్నదని మహా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## అనారోగ్యంతో మృతి చెందిన ఎల్లవ్వ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన డాక్టర్ మోహన్ నాయక్

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 22 (జన సంఘర్షణ)**



మెదక్ జిల్లా రామాయంపేట మండలం సుతార్ పల్లి గ్రామానికి చెందిన ఎరుకలి ఎల్లవ్వ అనారోగ్యంతో మరణించారు. ఇట్టి సమాచారాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ,లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్‌కి తెలియజేయగా వారి కుటుంబాన్ని కలిసి పరామర్శించి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దూరి సునీల్, ఉప సర్పంచ్ యాదగిరి,గ్రామ అధ్యక్షుడు ఏరుపుల దుర్గం, పున్న యాదగిరి,రాగి నారాయణ,స్వామి,మహేష్,లక్ష్మయ్య, సిహెచ్ స్వామి, సుధాకర్, సత్యం, శ్రీకాంత్, సురేష్, జెట్ చెరువు తండా సర్పంచ్ బాబు, రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## డిటిసిపి ఆర్‌డి కి రహదారి రోడ్డు విస్తరణ పనులను దగ్గరుండి చూపెట్టిన రామాయంపేట మున్సిపాలిటీ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 22 (జన సంఘర్షణ)**



మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు చొరవతో కదిలిన యంత్రాంగం, రామాయంపేట మున్సి పాలిటీలో మెయిన్ రోడ్డు విస్తరణలో భాగంగా పనులు పర్యవేక్షణకు వచ్చిన డిటిసిపి ఆర్డి వారికి దగ్గర ఉండి వివరించిన మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు,వైస్ చైర్ పర్సన్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు, యూత్ కాంగ్రెస్ నాయకుల,ు కాంగ్రెస్ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## అప్పాయిగూడెం గ్రామ పంచాయతీలో పారిశుధ్య, డ్రైనేజ్, నూతన పైప్‌లైన్ పనులు

**కారేపల్లి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్**





అప్పాయిగూడెం: గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు, పిచ్చిమొక్కలను ట్రాక్టర్ సహాయంతో తొలగించి, పరిసరాలను శుభ్రపరిచారు. అలాగే దోమలు, ఈగలు మరియు వ్యాధికారక క్రిముల నివారణకు అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం జరిగింది. అదేవిధంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు, మురుగు నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా సైడ్ డ్రైనేజ్ నిర్మాణ పనులు చేపట్టారు. జేసీబీ యంత్రం సహాయంతో డ్రైనేజ్ కోసం తవ్వకాలు చేపట్టి, అవసరమైన ప్రాంతాల్లో నూతన పైప్‌లైన్ ఏర్పాటు పనులు కూడా కొనసాగుతున్నాయి. ఈ పనుల ద్వారా వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే సమస్యను తగ్గించడంతో పాటు, గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని సర్పంచ్ దండు ప్రవీణ్ తెలిపారు. గ్రామ అభివృద్ధి మరియు ప్రజల సౌకర్యం కోసం అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, రోడ్లపై చెత్త వేయకుండా గ్రామ పంచాయతీకి సహకరించాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండు ప్రవీణ్, కార్యదర్శి కృష్ణవేణి, గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బీర్కూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా అరిగే ధర్మతేజ..

- ఏకగ్రీవంగా ఎన్నిక.. ఉపాధ్యక్షుడిగా రేంజర్ల అనిల్, ప్రధాన కార్యదర్శిగా కవిత పండరి

బీర్కూర్,/ ఆగస్టు 22( (జనసంఘర్షణ):





బీర్కూర్ మండల సర్పంచుల ఫోరం నూతన అధ్యక్షునిగా అరిగే ధర్మతేజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రేంజర్ల అనిల్, ప్రధాన కార్యదర్శిగా కవిత పండరి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అరిగే ధర్మతేజ మాట్లాడుతూ...బీర్కూర్ మండలంలోని సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, అలాగే ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సర్పంచుల ఐక్యతను కాపాడుతూ గ్రామాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రేంజర్ల అనిల్‌తో పాటు సుధరణి రాములు, కవిత పండరి, శ్రీనివాస్, రమేష్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడితో గొడవ.. పోలీసులపై దాడి

బోధన్, ఆగస్టు 22 (జన సంఘర్షణ)



బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడి విధులకు ఆటంకం కలిగించడంతో పాటు పోలీసులపై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆగస్టు 21న రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో కోప్పర్గ గ్రామానికి చెందిన రమొల్ల సాయిలు, బండారు వినయ్‌లు బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌తో గొడవపడుతూ విధులకు ఆటంకం కలిగిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో రాత్రి బ్లూకోల్ట్స్ విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు వెంటనే ఆసుపత్రికి చేరుకున్నారు. డాక్టర్లు, రోగులకు ఇబ్బంది కలగకుండా ఇద్దరినీ సముదాయించేందుకు పోలీసులు ప్రయత్నించినప్పటికీ వారు వినకుండా దురుసుగా ప్రవర్తించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో వారిని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో పోలీసులతో గొడవపడి దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బందిపై దాడులకు పాల్పడటం, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సహించేది లేదని, ఇలాంటి చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పోలీసులు హెచ్చరించారు.

# ఘనంగా సీనియర్ జర్నలిస్ట్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

- అంజిబాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన జర్నలిజం విద్యార్థులు

హైదరాబాద్ సిటీ ప్రతినిధి నాగుల అంజిబాబు, ఆగస్టు 22, (జన సంఘర్షణ):



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి సురవరం ప్రతాప రెడ్డి తెలుగు యూనివర్సిటీలో సీనియర్ జర్నలిస్టు కళ్యాణ్ దాస్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంజిబాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జర్నలిజం విద్యార్థిని, విద్యార్థులు అధ్యాపకులు శ్రేయోభిలాషులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఈ వారంలో జన్మదినోత్సవాలు జరుపుకున్న మిత్రులు ప్రదీప్, చాకలి హరీష్, అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దేని పురస్కరించుకొని ఫోటో జర్నలిస్టులు నవీన్, పవన్ కుమార్ లను కూడా అభినందించి సత్కరించారు. అలాగే ఇటీవల కూకట్పల్లి ప్రెస్ క్లబ్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కూకట్పల్లి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన నాగుల అంజిబాబుని కూడ ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్ కళ్యాణ్ ఏర్పాటు చేసిన ఆత్మీయ విందుకు జర్నలిజం విద్యార్థులు హాజరై ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వెంకటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు మిత్రులు మ్యాకం రవికుమార్, జహంగీర్, ప్రముఖ హైకోర్టు న్యాయవాది, కవి, రచయిత కొండూరి కోటిబాబు, విన్నపం ఒక పోరాటం వ్యవస్థాపక అధ్యక్షురాలు చీకూరి లీలావతి, పర్ఫెక్ట్ అకాడమీ డాక్టర్ పసుపులేటి హరీష్, జర్నలిజం విద్యార్థులు ఎస్ నరేష్, శివ, నదియా, నరసప్ప, రాచూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 3340 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి

- గత సంవత్సరం ఖరీఫ్ 2025 ఆగస్టు వరకు గాను 20758 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందించడం జరిగినది.
- ఖరీఫ్ 2026 ఆగస్టు వరకు ఇప్పటివరకు 19045 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరపారా చేయడం జరిగినది.
- రోజువారి 1,000-1,500 బ్యాగుల వరకు మండలాలలో అందుబాటులో ఉంచాం.
- డివిజన్ వారీగా ఎరువులు ఇవ్వడానికి ఆప్ ను అనుగుణంగా తీర్చిదిద్దాము.
- రైతులు అవసరాలకు మించి ఎక్కువగా ఎరువులను కొనుగోలు చేయడం వలన అవసరమైన రైతులకు ఎరువులు అందటం లేదు.
- అందుబాటులో వున్న ఎరువులకంటే ఎక్కువగా బుకింగ్ చేయడం వలన ఈ ఆప్ లో సాంకేతిక సమస్యలు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.
- రైతులు వారి మండలాలే కాకుండా వేరే ఇతర మండలా లలో కూడా కొనుగోలు చేయవచ్చు.
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 22 (జన సంఘర్షణ)

జిల్లాలో రైతులెవరు ఎరువులు కోసం ఆందోళన అవసరం లేదని కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆప్ సాంకేతిక సమస్యలపై నివృత్తి చేసే దిశగా ముందుకు పోతుందని, రైతులు అవసరమైన మేర మాత్రమే యాప్ ను ఉపయోగించి ఎరువులు కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శనివారం ఒక ప్రకటన ద్వారారైతులకు విజ్ఞప్తి చేశారు. మెదక్ జిల్లాలో యూరియా యాప్ సాంకేతిక సమస్యలపై కలెక్టర్ స్పందిస్తూ శనివారం కలెక్టరేట్ కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేస్తూ రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. జిల్లాలో 3,340 మెట్రిక్ టన్నులు ఎరువులు అందుబాటులో ఉన్నవని తెలిపారు. ఖరీఫ్ 2025 ఆగస్టు వరకు గాను 20,758 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందించడం జరిగిందన్నారు. ఖరీఫ్ 2026 ఆగస్టు వరకు గాను 19,045 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరపారా చేయడం జరిగిందని వివరించారు. ప్రతి రోజు 1000-1500 బ్యాగుల వరకు మండలాలలో అందుబాటులో వుంచడం ఉంచామని చెప్పారు.జిల్లా వ్యవసాయ శాఖతో పాటు ప్రత్యేకించి కమిషనర్,డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ జిల్లాలో ఎరువుల ఆప్ సమస్యలపై వ్యవసాయ శాఖ కమిషనర్ తో మాట్లాడడం జరిగిందన్నారు. జిల్లాలో 7 ఆగస్టు 2026 రోజున ఎఫ్ ఎస్ ఎస్ ఎరువుల బుకింగ్ ఆప్ ను ప్రారంబించడం జరిగిందన్నారు. ఈ ఆప్ ద్వారానే రైతులు అన్నీ ఎరువులను కొనుగోలు చేయడం జరుగుతుందని. కొత్తగా వచ్చిన ఈ ఆప్ లో కొన్ని సాంకేతిక సమస్యలు మొదట ఉత్పన్నమైన వాటిని పరిగణలోకి తీసుకుని సమస్యను నివృత్తి చేయడానికి చేయడం జరిగింది అన్నారు. మొదటిగా జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా ఎరువులను కొనుగోలు చేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు.దీని ద్వారా రైతులు వారి మండలాలే కాకుండా వేరే ఇతర మండలా లలో కూడా కొనుగోలు చేసే విధంగా పటిష్ట ప్రణాళిక ద్వారా ముందుకు వెళు తున్నట్లు వివరించారు. దీని వల్ల రైతులు దూరం అవుతుందని, ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి గత 2 రోజుల నుండి డివిజన్ వారీగా ఎరువులు ఇవ్వడానికి ఆప్ ను అనుగుణంగా తీర్చిదిద్దడం



జరిగిందన్నారు.జిల్లాలో రైతులు అందుబాటులో వున్న ఎరువులకంటే ఎక్కువగా బుకింగ్ చేయడం వలన ఈ ఆప్ లో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నట్టు స్పష్టం చేశారు.ఈ సమస్యలను ఎదుర్కొనేందుకు కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ గారికి నివేదికను పంపడం జరిగిందన్నారు. వారు ఒక్కో క్కటిగా సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రైతులు అవసరాలకు మించి ఎక్కువగా ఎరువులను కొనుగోలు చేయడం వలన అవసరమైన రైతులకు ఎరువులు అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు జిల్లా వ్యవసాయ శాఖ సలహాలు సూచనలు పాటిస్తూ అవసరాల మేరకు ఎరువులు ఆప్ ద్వారా బుక్ చేసుకోవాలన్నారు. రైతులందరు సమన్వయం పాటించి అందుబాటులో ఉన్న ఎరువులను అప్ ద్వారా పొందాలన్నారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై డీసీసీ నిర్వహించిన జనరల్ మీటింగ్

- హాజరైన చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ నాయుడు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం, ఆగష్టు 22(జనసంఘర్షణ):

కొత్తగూడెం,డీసీసీ ప్రెసిడెంట్ తోట దేవి ప్రసన్న ఆదేశాల మేరకు, ఎస్ ఐ ఆర్ ప్రక్రియ రెండో దశలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జనరల్ మీటింగ్‌లో చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాబోయే 10 రోజుల పాటు బూత్ ఏజెంట్లు తమకు కేటాయించిన బూత్‌ల పరిధిలోని ఓటర్ లిస్టులను పూర్తిస్థాయిలో, సక్రమంగా తనిఖీ చేసి, ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ సోడి చలపతి పాల్గొని, ప్రతి బూత్ పరిధిలోని ఓటర్ లిస్టులను క్షుణ్ణంగా పరిశీలించి, ఎస్ ఐ ఆర్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగాలని అలాగే గ్రామస్థాయిలో పార్టీ కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ, ఎస్ ఐ ఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# పాంచజన్య సభ పోస్టర్ విడుదల

బోధన్,ఆగస్టు 22(జన సంఘర్షణ)



బోధన్ అంబేద్కర్ చౌరస్తా వద్ద పాంచజన్య సంకల్ప సభ, చలో నిజామాబాద్ పోస్టర్లను టీఆర్ఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఆగస్టు 31న నిజామాబాద్ కలెక్టరేట్ మైదానంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో భారీ శంఖారావ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువత, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

# ఆఫీసర్ ఇంట్లోనే పేకాట గుట్టురట్టు....!

- పోలీసుల మెరుపు దాడి.. ప్రజాప్రతినిధి, విజిలెన్స్ కానిస్టేబుల్ సహా ఏడుగురు అరెస్ట్...
- రూ.1.50 లక్షల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం.. అధికారుల తీరుపై తీవ్ర చర్చ...

నిజామాబాద్ క్రైమ్, ఆగస్టు 22 (జన సంఘర్షణ):

చట్టాలను అమలు చేయాల్సిన బాధ్యతాయుతమైన అధికారులే నిబంధనలను ఉల్లంఘిస్తూ పేకాట ఆడుతూ పట్టుబడిన ఘటన నిజామాబాద్‌లో కలకలం రేపింది. ఏకంగా ఓ అటవీ శాఖాధికారి నివాసమే పేకాట స్థావరంగా మారడం.. అక్కడ విజిలెన్స్ విభాగానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్, మాజీ ఎంపీపీతో పాటు మరో నలుగురు పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది.

**పక్కా సమాచారంతో మెరుపు దాడి....**

నిజామాబాద్‌లోని ముబారక్‌నగర్ ఆర్టీసీ కాలనీలో ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారంతో 'చీతా ఫోర్స్' పోలీసులు శుక్రవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఆకస్మికంగా దాడి చేశారు. పోలీసుల తనిఖీల్లో ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు.వారిలో ఇంటి యజమాని అయిన అటవీ శాఖాధికారితో పాటు ట్రాన్స్‌కో విజిలెన్స్ విభాగంలో విధులు... నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్, మాజీ ఎంపీపీ, మరో నలుగురు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

**రూ.1.50 లక్షల నగదు స్వాధీనం...**




పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సుమారు రూ. 1.50 లక్షల నగదు, పలు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులపై జూద చట్టంలోని 3, 4 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం.

**అధికారులపై ఉన్నతాధికారుల నిఘా అవసరమా?....**

సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఇలాంటి వ్యవహారాల్లో పట్టుబడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చట్టాన్ని కాపాడాల్సిన వారే చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొంటే ప్రజలకు ఎలాంటి సందేశం వెళ్తుంది? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ఈ ఘటనను ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసు సిబ్బంది విధి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారా? అనే అంశంపై శాఖాపరమైన విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది.

**పేకాట వెనుక ఇంకెవరైనా ఉన్నారా?.....**

పేకాట నిర్వహణ వెనుక మరెవరైనా ఉన్నారా? ఇదే ఇంట్లో గతంలోనూ పేకాట కొనసాగిందా? నగదు లావాదేవీలు ఎలా జరిగాయి? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. పట్టుబడిన వ్యక్తుల వివరాలు, వారి పాత్ర, పేకాట నిర్వహణకు సంబంధించిన అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పట్టుబడటం వ్యవస్థకు హెచ్చరిక వంటిదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

జన సంఘర్షణ
ఆదివారం 23 ఆగస్టు 2026

# ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా లావుడ్య రమేశ్ ఏకగ్రీవ ఎన్నిక

- నియామక పత్రాన్ని అందజేసిన ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్
- మంత్రి సీతక్క ఆదేశాల మేరకు.

**ములుగు జిల్లా, ములుగు పట్టణం, ఆగస్టు 22(జనసంఘర్షణ):** ములుగు పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా లావుడ్య రమేశ్ ని ఏకగ్రీవంగా నియమించడం పట్ల కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ , ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో లావుడ్య రమేశ్ నియామకాన్ని ప్రకటించారు. ములుగు పట్టణంలోని పార్టీ నాయకులందరి సమక్షంలో రమేశ్ నియామకం జరగడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. పట్టణ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన లావుడ్య రమేశ్ కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. పార్టీ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రమేశ్, మంత్రి ధనసరి అనసూయ సీతక్క ని కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీని బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విధివిధానాలకు అనుగుణంగా పనిచేస్తూ, ములుగు పట్టణంలోని ప్రతి నాయకుడు, కార్యకర్తను కలుపుకొని ఐకమత్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు మంత్రి సీతక్క దృష్టికి, నా దృష్టికి తీసుకువచ్చి, ప్రజలకు తగిన న్యాయం జరిగేలా కృషి చేయాలని అన్నారు. అలాగే ములుగు పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలను, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగుతూ పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా లావుడ్య రమేశ్ పనితీరు, నడవడిక ఉండాలని కోరుకుంటున్నాను. లావుడ్య రమేశ్ నాయకత్వంలో ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేయాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ వారికి మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, బానోత్ రవిచందర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్, పంచాయతీ రాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి,జిల్లా అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి తో పాటుగా ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ, పట్టణ





# కష్టంతో కాదు... ఇష్టంతో విద్యాబోధన..

- బ్లాక్‌బోర్డుతో కాదు.. ప్రయోగాత్మక బోధనతో విద్యార్థుల్లో ఆసక్తి పెంపు....
- వినూత్న బోధనా పద్ధతులతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గాంధారి ఉపాధ్యాయురాలు భవాని.






**కామారెడ్డి బ్యూరో:/ఆగస్టు 22/జన సంఘర్షణ** "పాఠశాలకు వచ్చామా.. పాఠాలు చెప్పామా.. వెళ్లామా" అనే ధోరణికి భిన్నంగా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు భవాని. కష్టంతో కాదు.. ఇష్టంతో విద్యాబోధన సాగాలి. బ్లాక్‌బోర్డుతో మాత్రమే కాదు.. ప్రయోగాత్మకంగా బోధన ఉండాలి అనే ఆలోచనతో ముందుకు సాగుతున్న ఆమెకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డులు వరించాయి. కామారెడ్డి జిల్లా గాంధారి ప్రాథమిక పాఠశాలలో 2018 నుంచి ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న భవాని.. ముఖ్యంగా గణిత బోధనలో వినూత్న పద్ధతులను అనుసరిస్తూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచుతున్నారు. ఈ నేపథ్యంలో మన దినపత్రిక తెలంగాణ స్టేట్ చీఫ్ బ్యూరో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు భవానితో నిర్వహించిన ముఖాముఖిలో ఆమె తన బోధనా అనుభవాలను, విజయ రహస్యాలను వెల్లడించారు.

**ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన పెంచాలి...**

ప్రభుత్వ పాఠశాలలంటే కొంతమందిలో చిన్నచూపు ఉండటంతో ప్రైవేట్ పాఠశాలల వైపు తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారని అడిగిన ప్రశ్నకు భవాని స్పందిస్తూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, విద్యార్థులకు అందుతున్న వివిధ సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తమ పాఠశాలలో ఒకప్పుడు కేవలం 40 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 150కి చేరిందని ఆమె తెలిపారు. తల్లిదండ్రులతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ పాఠశాలలో పిల్లలకు అందుతున్న విద్యా విధానాన్ని వివరిస్తున్నామని, వారి సూచనలు తీసుకుని బోధనలో మార్పులు చేస్తున్నామని చెప్పారు.

**ప్రాథమిక విద్యే పునాది....**

"ప్రాథమిక విద్య అనేది ఒక భవనానికి పునాది వంటిది. పునాది ఎంత పటిష్టంగా ఉంటే భవనం అంత బలంగా ఉంటుంది. అలాగే చిన్నారులకు ప్రాథమిక దశలో విద్యపై బలమైన పునాది ఏర్పడితే భవిష్యత్తులో వారు ఉన్నత విద్యను ధైర్యంగా అభ్యసించగలుగుతారు" అని భవాని పేర్కొన్నారు. బ్లాక్‌బోర్డుపై రాయడం, పాఠ్యపుస్తకంలోని అంశాలను చదివించడం మాత్రమే విద్యాబోధన కాదని, విద్యార్థులకు ఏ విధంగా బోధిస్తే సులభంగా అర్థమవుతుందో ఆ విధానాన్ని గుర్తించి ప్రయోగాత్మకంగా బోధించాల్సిన అవసరం ఉందన్నారు.

**ఫిన్లాండ్ విద్యా విధానం స్ఫూర్తిదాయకం....**

రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన ఉపాధ్యాయుల బృందంలో తాను కూడా చోటు దక్కించుకుని ప్రపంచంలో అత్యుత్తమ విద్యా విధానాలకు పేరుగాంచిన ఫిన్లాండ్ దేశాన్ని సందర్శించే అవకాశం లభించిందని భవాని తెలిపారు. అక్కడ విద్యార్థులకు బోధించే విధానం, తరగతి గదుల్లో అనుసరించే ప్రయోగాత్మక పద్ధతులు తనను ఎంతో ఆకట్టుకున్నాయని చెప్పారు. ఫిన్లాండ్‌లో తాను గమనించిన మంచి బోధనా విధానాలను మన ప్రాంతంలోని విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో తన బోధనలో వాటిని అన్వయిస్తున్నట్లు వెల్లడించారు.

**గోడలే బోధనా సాధనాలుగా......**

భవాని బోధనా విధానంలో మరో ప్రత్యేకత పాఠశాల గోడలు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ చిత్రాలు, దేశ రక్షణలో సేవలందిస్తున్న సైనికుల చిత్రాలు, విద్యార్థుల చుట్టూ కనిపించే పక్షుల చిత్రాలు గోడలపై చిత్రించి పిల్లల్లో ఆసక్తిని పెంచుతున్నారు.తరగతి గదికి మాత్రమే పరిమితం కాకుండా పరిసరాలను కూడా ఒక బోధనా సాధనంగా మార్చుకోవడం ద్వారా విద్యార్థులు చూసి, ఆలోచించి, ప్రశ్నించి నేర్చుకునే వాతావరణాన్ని కల్పిస్తున్నారు.

**డిజిటల్ వేదికలతోనూ బోధన....**

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను సైతం విద్యాబోధనకు అనుకూలంగా ఉపయోగిస్తూ విద్యార్థులకు సులభమైన రీతిలో పాఠ్యాంశాలను అందిస్తున్నారు. వినూత్న బోధనా పద్ధతులు, ప్రయోగాత్మక విద్య, సృజనాత్మక ఆలోచనలతోనే విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

**రాష్ట్రం నుంచి జాతీయ అవార్డుకు ఎంపిక....**

ఇటీవల రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న భవాని.. ఇప్పుడు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా ఎంపికైన 40 మంది ఉపాధ్యాయుల జాబితాలో తెలంగాణ నుంచి భవానికి చోటు దక్కడం విశేషం. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 5న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఆమె జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోనున్నారు.

**సహచర ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు....**

తాను చేపడుతున్న వినూత్న బోధనా కార్యక్రమాలకు తోటి ఉపాధ్యాయులు అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని భవాని తెలిపారు. వారి ప్రోత్సాహం, సహకారం వల్లే రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే అవకాశం లభించిందని పేర్కొంటూ సహచర ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**కలెక్టర్ అభినందనలు.....**

కామారెడ్డి జిల్లా గాంధారి ప్రాథమిక పాఠశాల నుంచి జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు ఎంపికైన భవానిని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అభినందించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, మండల విద్యాశాఖ అధికారులు కూడా భవానికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూ వినూత్న బోధనా విధానాలతో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్న భవాని.. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, ముఖ్యంగా ప్రాథమిక విద్యాబోధనలో కొత్త ఆలోచనలకు ఒక ఆదర్శంగా నిలుస్తున్నారు. "పిల్లలకు చదువు చెప్పడం మాత్రమే కాదు.. చదువుకోవాలనే ఇష్టాన్ని కల్పించడమే అసలైన ఉపాధ్యాయుడి విజయం" అనే భవాని ఆలోచన.. నేటి విద్యా వ్యవస్థకు ఆదర్శప్రాయంగా నిలుస్తోంది.

# ఎంఆర్‌పీఎస్ కోటగిరి మండల నూతన కమిటీ ఏర్పాటు




**కోటగిరి, ఆగస్టు 22 (జన సంఘర్షణ):** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కోటగిరి మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తల సమక్షంలో నూతన కమిటీని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సోంపూర్ కే. పోచారం మాదిగ పాల్గొని నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.


మండల అధ్యక్షుడిగా కొండాపూర్ ఏకతం పాండీ, ఉపాధ్యక్షుడిగా తుమ్మల శ్రీను (ఎలాండ్) ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కుంటెవాలి శ్రీకాంత్ను నియమించారు. కార్యదర్శులుగా భాష సాయిబాబ (బస్వాపూర్), వడ్డే సాయిలు (రాంపూర్), కన్నం శ్రీనివాస్ తదితరులను ఎంపిక చేశారు. కార్యవర్గ సభ్యులుగా మేత్రి రాజుమతి, కన్నం సాయిలు, రేణి ప్రశాంత్ మాదిగ, గడ్డం శివ తదితరులను నియమించారు.

**హక్కుల సాధనకు ఐక్యంగా పోరాటం...**

ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. మాదిగల హక్కులు, సామాజిక న్యాయం, రిజర్వేషన్ల సాధన కోసం వీఁరాూ ఆధ్వర్యంలో ఐక్యంగా పనిచేస్తామని తెలిపారు. మండలంలోని మాదిగ సమాజ సమస్యలను గుర్తించి, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. వీఁరాూ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి కార్యకర్తలను సమీకరించి ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

# రాజ్యాంగ మౌలిక సూత్రాలపై అవగాహన అవసరం

**బోధన్ ఆగస్టు 22(జన సంఘర్షణ)**




సమాజంలో మూఢనమ్మకాలను అరికట్టి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే జన విజ్ఞాన వేదిక ప్రధాన లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షుడు బొర్రా రామారావు తెలిపారు. బోధన్లోని అజాంగంజ్ పాఠశాలలో విద్యార్థులకు రాజ్యాంగ మౌలిక స్వరూపం, లౌకికత్వంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇప్పటివరకు సుమారు 15 వేల మంది విద్యార్థులకు రాజ్యాంగ విలువలపై చైతన్యం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

# చేగుంట స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్లు

- జిల్లా ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ అంబాదాస్ రాజేశ్వర్ ఒక ప్రకటనలు తెలిపారు.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 22(జన సంఘర్షణ)** మెదక్ జిల్లాలోని చేగుంట స్పోర్ట్స్ స్కూల్‌లో బ్యాటరీ టెస్టు ద్వారా ఈ నెల 30 నుండి 31 వరకు ఎంపిక జిల్లా ఇంచార్జీ అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ ఒక్క ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లాలోని చేగుంటలో కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి బాలికల గిరిజన సంక్షేమ క్రీడా పాఠశాలలో 5 వ, 6,7,8వ తరగతిలలో ప్రవేశాలను బ్యాటరీ టెస్టు ద్వారా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఇంచార్జీ అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ ఒక్క ప్రకటనలో తెలిపారు. చేగుంటలోని గురుకుల పాఠశాలలో ఈనెల 30,31 తేదీలలో ఉదయం 10గంటలనుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యార్థినులు కులం, ఆదాయం బోనాఫైడ్ ధృవీకరణ పత్రాలు తీసుకుని బ్యాటరీ టెస్టుకు హాజరు కావాలన్నారు. 5వ తరగతిలో ఎస్టీ (35), ఎస్సీ (05), బీసీ (05) ఓసీ (05) మైనారిటీ (05) (01)6వ తరగతిలో ఎస్టీ (27)7వ తరగతిలో ఎస్టీ (03)8వ తరగతిలో ఎస్టీ (03) ఖాళీలు ఉన్నాయన్నారు. గురుకులల నియమ నిబంధనల ప్రకారం విద్యార్థినుల ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్రంలోని గిరిజన విద్యార్థినులందరూ పాల్గొనే అవకాశముందని చెప్పారు.

# దివ్యాంగులకు యు డి ఐ డి ప్రత్యేక క్యాంపు తేదీలో మార్పు

- ఈనెల 25 న ఆగస్టు దివ్యాంగులకు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి మెదక్ నందు యూ డి ఐ డి శిబిరం.
- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 22 (జన సంఘర్షణ)** దివ్యాంగులకు యూ.డిఐ.డి శిబిరం క్యాంపు ఏర్పాటుపై జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన ప్రకటన ఆధారంగాఈనెల 26 తేదీన దివ్యాంగుల యూ డి ఐ డి క్యాంప్ నిర్వహించబడునని ప్రకటన జారీ చేయడం జరిగిందని చెప్పారు.ఈనెల 26 వ తేదీన మిలాద్ ఉన్ నబి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్న నేపథ్యంలో దివ్యాంగుల యు డి ఐ డి శిబిరాన్ని ఆగస్టు 25వ తేదీన ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి మెదక్ నందు నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు.నూతన చేయూత పెన్షన్ల దరఖాస్తులు ఈనెల 31న ముగుస్తున్న నేపథ్యంలో దివ్యాంగులు ఇంకా యు డి ఐ డి ధృవీకరణ పత్రం రానివారు, ఆదివారం ఆగష్టు 25 సాయంత్రం వరకు మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారికి సోమువారం స్లాట్ బుక్ అవడం జరుగుతుందని మంగళవారం (25.08.2026) నాడు మెదక ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నందు శిబిరం జరుపబడునన్నారు.యు డి ఐ డి దరఖాస్తు చేసుకున్న వారికి డి ఆర్ డి ఎ కార్యాలయం నుండి, మండల ఏపీఎం నుండి క్యాంపు నిర్వహణ సమాచారం తెలపబడునని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# దివ్యాంగులకు యు డి ఐ డి ప్రత్యేక క్యాంపు తేదీలో మార్పు

- ఈనెల 25 న ఆగస్టు దివ్యాంగులకు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి మెదక్ నందు యూ డి ఐ డి శిబిరం.
- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 22 (జన సంఘర్షణ)** దివ్యాంగులకు యూ.డిఐ.డి శిబిరం క్యాంపు ఏర్పాటుపై జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన ప్రకటన ఆధారంగాఈనెల 26 తేదీన దివ్యాంగుల యూ డి ఐ డి క్యాంప్ నిర్వహించబడునని ప్రకటన జారీ చేయడం జరిగిందని చెప్పారు.ఈనెల 26 వ తేదీన మిలాద్ ఉన్ నబి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్న నేపథ్యంలో దివ్యాంగుల యు డి ఐ డి శిబిరాన్ని ఆగస్టు 25వ తేదీన ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి మెదక్ నందు నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు.నూతన చేయూత పెన్షన్ల దరఖాస్తులు ఈనెల 31న ముగుస్తున్న నేపథ్యంలో దివ్యాంగులు ఇంకా యు డి ఐ డి ధృవీకరణ పత్రం రానివారు, ఆదివారం ఆగష్టు 25 సాయంత్రం వరకు మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారికి సోమువారం స్లాట్ బుక్ అవడం జరుగుతుందని మంగళవారం (25.08.2026) నాడు మెదక ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నందు శిబిరం జరుపబడునన్నారు. యు డి ఐ డి దరఖాస్తు చేసుకున్న వారికి డి ఆర్ డి ఎ కార్యాలయం నుండి, మండల ఏపీఎం నుండి క్యాంపు నిర్వహణ సమాచారం తెలపబడునని శ్రీనివాసరావు పేర్కొన్నారు.



# పోతంగల్ మండల ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీ ఏర్పాటు...

- మాదిగల హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలి...




**పోతంగల్, ఆగస్టు 22 (జనసంఘర్షణ):** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పోతంగల్ మండల నూతన కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. మాదిగల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, ఎస్సీ వర్గీకరణ సాధన లక్ష్యంగా సంఘాన్ని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని నూతన కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

**ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి....**

నిజామాబాద్ జిల్లా మాసాయిపేట యాదగిరి మాదిగ, బాన్సువాడ ఇన్‌చార్జి సోంపూర్ పోచారం ముఖ్య అతిథులుగా హాజరై నూతన కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. మాదిగ సమాజం హక్కుల సాధన కోసం ఐకమత్యంతో ఉద్యమించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

**మండల అధ్యక్షుడిగా నేరెల అశోక్....**

ఈ సందర్భంగా పోతంగల్ మండల వీఁహూ అధ్యక్షుడిగా నేరెల అశోక్ మాదిగను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల కమిటీతో పాటు వివిధ అనుబంధ విభాగాలకు పలువురు నాయకులు, కార్యకర్తలను ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. మాదిగ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ వీఁహూను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.

**పలువురికి బాధ్యతలు....**

కమిటీలో నక్కవారి హరిదాస్, మేత్రి సంజయ్, కోర్రె స్థాయినాథ్, గాయక్ మా. సంతమాగ్, జెండా విఠల్, బాలయ్య, కాంచే రాజేష్, చైతన్య, శ్రీకర్ రాజా, గంటి సురేష్ మాదిగ తదితరులకు వివిధ బాధ్యతలు అప్పగించారు.

**యువతలో చైతన్యానికి ప్రత్యేక కార్యక్రమాలు....**

మాదిగ సమాజ అభ్యున్నతికి విద్య, ఉపాధి, సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ముఖ్యంగా యువతలో మాదిగల హక్కులు, సామాజిక న్యాయం, ఎస్సీ వర్గీకరణపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఎంఆర్‌పీఎస్ ఆశయాలకు అనుగుణంగా ఐకమత్యం, అంకితభావంతో పనిచేస్తూ సమాజ అభ్యున్నతికి కృషి చేస్తామని నూతన బాధ్యులు తెలిపారు. నూతన కమిటీ ఏర్పాటు పట్ల ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ బాధ్యతలు స్వీకరించిన వారిని అభినందించారు.

# కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ విద్యావేత్తల బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి ఫలప్రదమైన సమావేశం

- తెలంగాణలో విద్య, పరిశోధన, స్టార్టప్ రంగాల్లో భాగస్వామ్యంపై చర్చలు-
- హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని ఆహ్వానం





**హైదరాబాద్/ఆగస్టు 22/జన సంఘర్షణ** తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ విద్యావేత్తల బృందంతో ఫలప్రదమైన సమావేశం నిర్వహించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

**హైదరాబాద్‌లో అంతర్జాతీయ విద్యా అవకాశాలు**

హైదరాబాద్‌లో ప్రపంచ అత్యుత్తమ విద్యా సంస్థలకు ఉన్న అవకాశాలను తెలంగాణ ప్రతినిధి బృందం కేంబ్రిడ్జ్ విద్యావేత్తలకు వివరించింది. ప్రపంచస్థాయి విజ్ఞాన, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంలో కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం భాగస్వామి కావాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్లు జైదీప్ ప్రభు, వెంకట సిరీష్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న అవకాశాలపై వారు సానుకూలంగా స్పందించారు.

**విద్య, పరిశోధన, స్టార్టప్‌లపై ప్రత్యేక దృష్టి....**

హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాల నిర్వహణ, సంయుక్త పరిశోధనలు, యువ పారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్ సదుపాయాలు, స్టార్టప్‌ల అభివృద్ధికి సహకారం వంటి అంశాలపై ఇరు వర్గాలు చర్చించాయి. ఈ రంగాల్లో పరస్పర సహకారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సమావేశంలో నిర్ణయించినట్లు ప్రతినిధులు తెలిపారు.

**తెలంగాణ రైజింగ్‌కు మరింత బలం..**

కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంతో తెలంగాణ భాగస్వామ్యానికి ఈ చర్చలు కొత్త మార్గాన్ని చూపనున్నాయని అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్య, పరిశోధన, ఆవిష్కరణలకు కేంద్రంగా తీర్చిదిద్దాలన్న తెలంగాణ రైజింగ్ లక్ష్యానికి ఈ భాగస్వామ్యం మరింత బలం చేకూర్చనుంది. ప్రపంచస్థాయి విద్యా సంస్థలతో అనుసంధానం ద్వారా తెలంగాణ యువతకు కొత్త అవకాశాలు, పరిశోధకులకు అంతర్జాతీయ భాగస్వామ్యాలు, స్టార్టప్ రంగానికి మరింత ప్రోత్సాహం లభించే అవకాశం ఉందని సమావేశం ద్వారా స్పష్టమైంది.

# బడి పక్కనే కల్లుబట్టి.. కల్లులో క్రిమికీటకాలు, ఆయిల్ కల్తీ ఆరోపణలు!...

- పది రోజులైనా చర్యలేవీ లేవా?.. తాజాగా కల్లులో ఆయిల్ తరహా పదార్థం ఉందంటున్న గ్రామస్తులు...
- డిపోకు లైసెన్స్ ఉందా?.. ఎక్సైజ్ శాఖ నిఘా ఎక్కడంటూ ప్రశ్నలు....

**పోతంగల్, ఆగస్టు 22 (జన సంఘర్షణ):** పోతంగల్ మండల కేంద్రంలో పాఠశాల పక్కనే కొనసాగుతున్న కల్లు డిపో వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కల్లు ప్యాకెట్లలో నట్టలు, క్రిమి కీటకాలు కనిపించాయని పది రోజుల క్రితం స్థానికులు ఆరోపించినప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో స్పందించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఇదే డిపోలో విక్రయిస్తున్న కల్లులో ఆయిల్ తరహా పదార్థం కనిపించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని డిపో నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లగా.. "తాగితే తాగండి.. లేకుంటే వెళ్లండి" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించిన వీడియోలు తమ వద్ద ఉన్నాయని వారు పేర్కొంటున్నారు.



**బడి పక్కనే కల్లుబట్టి.. నిబంధనలు ఏమంటున్నాయి?.....**

పాఠశాలకు సమీపంలోనే కల్లు డిపో కొనసాగుతుండటంపై స్థానికులు ప్రశ్నలు సంధిస్తున్నారు. సదరు డిపోకు అధికారిక లైసెన్స్ ఉందా? ఉంటే ఏ నిబంధనల ప్రకారం అనుమతి ఇచ్చారు? అనే విషయాలను ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేయాలని కోరుతున్నారు. అంతేకాకుండా పోతంగల్ మండలంలో ఎన్ని కల్లు డిపోలకు అనుమతులు ఉన్నాయి?... వాటి నిర్వహణపై అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తున్నారా? అనే అంశాలపై కూడా స్పష్టత ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా?.....**

కల్లు నాణ్యతపై వరుసగా ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. కల్లు నమూనాలను సేకరించి ప్రయోగశాలలో పరీక్షించాలని, నిబంధనల ఉల్లంఘన తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పాఠశాల పక్కనే ఉన్న డిపోపై ఆరోపణలు రావడం మరింత ఆందోళన కలిగిస్తోందని స్థానికులు అంటున్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశాన్ని అధికారులు తేలికగా తీసుకోకుండా, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

**ఇకనైనా అధికారుల నిఘా పెంచాలి....**

ఒకసారి కాదు.. వరుసగా ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ఇకనైనా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కల్తీ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, ప్రజలకు వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. "ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే చూస్తూ ఊరుకోం...... అధికారులు వెంటనే స్పందించాలి" అంటూ స్థానికులు హెచ్చరిస్తున్నారు.

గమనిక....: కల్తీ, లైసెన్స్ తదితర ఆరోపణలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. సంబంధిత అధికారులు విచారణ నిర్వహించి వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.







# రెవెన్యూ, హౌసింగ్ శాఖలపై మంత్రి పొంగులేటి సమీక్ష

**కామారెడ్డి, ఆగస్టు 22 (జన సంఘర్షణ):**






ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) ప్రధాన సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో రెవెన్యూ అంశాలతో పాటు గృహ నిర్మాణ కార్యక్రమాల ప్రగతిపై మంత్రి అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఆయా శాఖల పరిధిలో కొనసాగుతున్న కార్యక్రమాలు, పనుల పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్, స్పెషల్ సెక్రటరీ రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ సంస్థ ఎం.డీ. గౌతమ్తో పాటు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు భవేష్ మిశ్రా, ఆశిష్ సాంగ్వాన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ప్రగతిని సమీక్షించిన మంత్రి.. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించినట్లు సమాచారం. రెవెన్యూ, గృహ నిర్మాణం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖలకు సంబంధించిన అంశాల్లో క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# న్యూసెన్స్ చేశాడని బెటాలియన్ కానిస్టేబుల్‌ను చితకబాదారు

- మద్యం మత్తులో బార్ వద్ద హల్‌చల్..
- అడ్డుకున్న బీట్ కానిస్టేబుల్‌పై తిరగబడటంతో ఘటన

**వరంగల్/ఆగస్ట్ 22/జన సంఘర్షణ/**





మద్యం మత్తులో బార్ వద్ద న్యూసెన్స్ చేస్తున్నాడన్న ఆరోపణలతో ఓ బెటాలియన్ కానిస్టేబుల్‌ను బీట్ కానిస్టేబుల్, స్థానికులు కలిసి కొట్టిన ఘటన వరంగల్ జిల్లా ఉర్సుగుట్ట పరిధిలో చోటుచేసుకుంది.

వివరాల ప్రకారం...ఉర్సుగుట్ట సమీపంలోని ఓ బార్‌లో మద్యం సేవించిన బెటాలియన్ కానిస్టేబుల్ మద్యం మత్తులో హల్‌చల్ చేస్తూ న్యూసెన్స్ చేస్తున్నట్లు బార్ సిబ్బంది గుర్తించారు. దీంతో వారు 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న బీట్ కానిస్టేబుల్ సంతోష్ రెడ్డి అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం. బెటాలియన్ కానిస్టేబుల్‌కు షర్టు వేసుకుని అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచిస్తూ చెంపపై కొట్టినట్లు తెలుస్తోంది. దీంతో ఆగ్రహించిన బెటాలియన్ కానిస్టేబుల్ తిరిగి సంతోష్ రెడ్డిపై చేయి చేసుకున్నట్లు సమాచారం. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారగా, బీట్ కానిస్టేబుల్ లాఠీతో అతడిపై దాడి చేసినట్లు తెలుస్తోంది. అక్కడున్న స్థానికులు సైతం బెటాలియన్ కానిస్టేబుల్‌ను కొట్టినట్లు సమాచారం. ఈ ఘటనతో బార్ పరిసరాల్లో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు, కేసు నమోదు తదితర అంశాలపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
ఆదివారం
23 ఆగస్టు 2026

# అమ్మవారి సేవలో బీసీవై పార్టీ అధ్యక్షుడు బి. రామచంద్ర యాదవ్

తిరుచానూరు, ఆగస్టు 22 (జనసంఘర్షణ)




తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని బీసీవై పార్టీ అధ్యక్షుడు బి. రామచంద్ర యాదవ్ శనివారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద వారికి ఆలయ అధికారులు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న వారికి ఆలయ అధికారులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# అంగన్‌వాడీ కార్యకర్తల్లో నైపుణ్యాలు, సేవా సామర్థ్యాల పెంపునకు శిక్షణ

తొట్టంబేడు ఆగస్టు 22 (జనసంఘర్షణ) :




మండలం: శ్రీకాళహస్తి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తొట్టంబేడు మండలం పెద్దకన్నలి జడ్పీ హైస్కూల్ అంగన్‌వాడీ కార్యకర్తల కోసం జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తల్లో అవగాహన, నైపుణ్యాలు, సేవా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు, మండల ఎంఈఓ భారతి, హెడ్ మాస్టర్, లత శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు,అంగన్‌వాడి కార్యకర్తలు చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రీ-స్కూల్ విద్యతో పాటు గర్భిణీలు, బాలింతలు మ తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఈ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను జ్ఞానజ్యోతి శిక్షణ ద్వారా అందిస్తామని అన్నారు,ఈ కార్యక్రమంలో డి ఆర్ పి సూర్య, ధనలక్ష్మి, సూపర్వైజర్ మరియమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# కోలాహలంగ శ్రీ నల్గొండరాయ స్వామికి శ్రావణ శనివారం ప్రత్యేక పూజలు

బైరెడ్డిపల్లి, ఆగస్టు22 (జనసంఘర్షణ)



బైరెడ్డిపల్లి మండలం లోని కడపనత్తం గ్రామంలో నెలకొని ఉన్న శ్రీ నల్గొండరాయస్వామి ఆలయంలో శనివారం కోలాహలంగ స్వామికి శ్రావణ శనివారం ప్రత్యేక పూజలు ను అర్చకులు రామకృష్ణమాచార్యులుచే కొనసాగింది. ఉదయం స్వామి మూలవర్లకు పంచామృత అభిషేకం, విశేష పూజలు కొనసాగి మహామంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉభయదార్లుగా బెంగళూరు లో స్థిరపడ్డ వరలక్ష్మి కుటింభికులు వ్యవహరించారు.

# నైపుణ్యాలు, సేవా సామర్థ్యాల పెంపునకు శిక్షణ

సదుం గరుడ ధాత్రి (జనసంఘర్షణ)

సదుం జడ్పీ హైస్కూల్ లో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తల కోసం జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తల్లో అవగాహన, నైపుణ్యాలు, సేవా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు, కోర్సు డైరెక్టర్లు సిడిపిఓ వా శ్రీదేవి, ఇంచార్జ్ కోర్స్ డైరెక్టర్ నటరాజన్, ఐసిడి సూపర్వైజర్ మల్లీశ్వరి, డిఆర్పిలు కృష్ణమూర్తి వెంకటరమణ జయప్రకాష్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రీ-స్కూల్ విద్యతో పాటు గర్భిణీలు, బాలింతలు మ తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఈ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను జ్ఞాన జ్యోతి శిక్షణ ద్వారా అందిస్తామని అన్నారు.

# నన్ను కొట్టారు.. ఐఫోన్ దొంగిలించారు..

- **పోలీసులను ఆశ్రయించిన ఫోక్ సింగర్ మాధురి రాథోడ్**

వేములవాడ, ఆగస్టు 22 (జనసంఘర్షణ):
వేములవాడ పట్టణంలో ఇటీవల చోటుచేసుకున్న ఓ వివాదం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఫోక్ సాంగ్స్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఆర్టిస్టులు ఈశ్వర్ సాయి, మాధురి రాథోడ్‌లకు సంబంధించిన వ్యక్తిగత వ్యవహారం బహిరంగ చర్చనీయాంశంగా మారింది. ఇటీవల విడుదలైన 'ప్రమీల' ఫోక్ సాంగ్‌లో ఈశ్వర్ సాయి, మాధురి రాథోడ్ జంటగా నటించారు. ఆ పరిచయం వ్యక్తిగత వ్యవహారంగా మారిందన్న ప్రచారం నేపథ్యంలో.. ఓ హోటల్‌లో ఇద్దరూ కలిసి ఉన్న సమయంలో ఈశ్వర్ సాయి భార్య శరణ్య అక్కడికి చేరుకోవడంతో వివాదం తలెత్తినట్లు ప్రచారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ నేపథ్యంలో మాధురి రాథోడ్ వేములవాడ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తనపై ఎలాంటి కారణం లేకుండా దాడి చేశారని, అసభ్య పదజాలంతో దూషించారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. అంతేకాకుండా తనపై భౌతికంగా దాడి చేయడంతో పాటు అక్కడి దృశ్యాలను



వీడియోలు తీశారని, తన ఐఫోన్‌ను కూడా తీసుకెళ్లారని ఆరోపించినట్లు తెలిసింది. అదేవిధంగా సోషల్ మీడియా వేదికగా కొందరు ఉద్దేశపూర్వకంగా తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మాధురి రాథోడ్ ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. తనకు న్యాయం చేయాలని ఆమె పోలీసులను కోరినట్లు తెలుస్తోంది.

అయితే ఈ ఘటనకు సంబంధించిన ఆరోపణలు, ప్రత్యారోపణలపై పోలీసుల విచారణ అనంతరం వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది. ఫిర్యాదుపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? కేసు నమోదు చేశారా? అనే విషయాలపై అధికారిక సమాచారం రావాల్సి ఉంది.

# జర్నలిస్టులపై కక్షపూరిత కేసులా? పోలీసులకు సుప్రీంకోర్టు హెచ్చరిక!

న్యూఢిల్లీ, ఆగస్టు 22 (జన సంఘర్షణ):
ప్రజా సమస్యలను ప్రశ్నించే గొంతును అణచివేయడానికి కేసులు, బెదిరింపులు, వేధింపులను ఆయుధాలుగా ఉపయోగిస్తే చట్టం ముందు సమాధానం చెప్పాల్సిందేనని న్యాయస్థానాల తీర్పులు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా ప్రజా ప్రయోజన అంశాలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టుల విషయంలో పోలీసులు చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉంది. పెన్ను పట్టినా...... కెమెరా పట్టినా.. మైక్ పట్టుకుని ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చినా..... వార్తను ఆధారాలతో ప్రజల ముందుకు తీసుకెళ్లే మీడియా ప్రతినిధులు తమ విధులను నిర్వర్తిస్తున్నారు. రాజకీయ నాయకులు, అక్రమ దందాలు, అవినీతి ఆరోపణలు, ప్రభుత్వ శాఖల్లోని లోపాలను ప్రశ్నిస్తూ వార్తలు రాసినంత మాత్రాన కక్షపూరితంగా కేసులు నమోదు చేయడం, పోలీసు అధికారులను వ్యక్తిగత కక్షలకు ఉపయోగించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరం.

**వార్త నచ్చకపోతే సమాధానం ఇవ్వాలి.. కేసులతో నోరు మూయించకూడదు!**

జర్నలిస్టు ప్రచురించిన వార్తలో తప్పు ఉందని భావిస్తే చట్టపరమైన మార్గాల్లో వివరణ ఇవ్వవచ్చు. పరువు నష్టం జరిగిందని భావిస్తే అందుకు చట్టంలో నిర్దేశించిన పరిష్కార మార్గాలు ఉన్నాయి. కానీ వార్త నచ్చలేదనే కారణంతో పోలీసులను ఆశ్రయించి జర్నలిస్టుపై కేసులు పెట్టించడం, బెదిరించడం లేదా వేధించడం మాత్రం చట్టపరమైన ప్రక్రియకు ప్రత్యామ్నాయం కాదు. ప్రజా ప్రయోజనానికి సంబంధించిన ఆరోపణలను ఆధారాలతో వెలుగులోకి తీసుకువచ్చిన జర్నలిస్టులపై చర్యలు తీసుకునే ముందు పోలీసులు ఆరోపణల స్వభావం, అందుబాటులో ఉన్న ఆధారాలు, వర్తించే చట్టపరమైన నిబంధనలను సమగ్రంగా పరిశీలించాల్సిన బాధ్యత ఉంది.

**పోలీసులకూ చట్టమే.. అధికార దుర్వినియోగానికి చోటు లేదు!**

పోలీసులకు కేసు నమోదు చేసే అధికారం ఉన్నప్పటికీ,



ఆ అధికారం కక్ష సాధింపునకు ఉపయోగించుకునే స్వేచ్ఛ మాత్రం కాదు. చట్టబద్ధమైన కారణాలు లేకుండా ఎవరినైనా వేధించడం, తప్పుడు కేసులతో భయపెట్టడం, వ్యక్తిగత వివాదాలను క్రిమినల్ కేసుల రూపంలోకి మార్చడం వంటి చర్యలు న్యాయపరమైన పరిశీలనకు దారితీయవచ్చు.
ప్రింట్ మీడియా నుంచి టెలివిజన్ వరకు, డిజిటల్ మీడియా నుంచి యూట్యూబ్ న్యూస్ ఛానళ్ల వరకు పనిచేస్తున్న ప్రతి మీడియా ప్రతినిధి విషయంలో ఇదే చట్టపరమైన ప్రమాణాలు వర్తిస్తాయి.

**'కేసు పెట్టే ముందు చట్టాన్ని చదవండి.. అధికారాన్ని కాదు!'...**

జర్నలిస్టుపై కేసు నమోదు చేయడం చిన్న విషయం కాదని పోలీసులు గుర్తించాలి. వార్త రాశాడనే కోపంతో కేసు పెట్టడం ఒక విషయం.. నిజంగా నేరం జరిగిందని ప్రాథమిక ఆధారాలు ఉన్నప్పుడు చట్ట ప్రకారం కేసు నమోదు చేయడం మరో విషయం. ఈ రెండింటి మధ్య తేడాను పోలీసులు స్పష్టంగా గుర్తించాల్సిన అవసరం ఉంది.
అదేవిధంగా, జర్నలిస్టు సంఘాలకే పోలీసు కేసులను పరిష్కరించే అధికారం ఉందని, ప్రతి కేసును ఏడు రోజుల్లో సంఘాలే నిర్ణయించాలని సుప్రీంకోర్టు తాజాగా ఆదేశించిందనే ప్రచారంలో ఉన్న వాదనకు అధికారిక సుప్రీంకోర్టు ఉత్తర్వు ఆధారం ఉన్నదో లేదో ధృవీకరించకుండా దానిని సుప్రీంకోర్టు తాజా తీర్పుగా ప్రచారం చేయడం సరికాదు.
అయితే ఒక విషయం మాత్రం స్పష్టం- మీడియా స్వేచ్ఛను అణచివేయడానికి చట్టాన్ని ఆయుధంగా మార్చే ప్రయత్నాలు జరిగితే, ఆ చర్యలు కూడా న్యాయపరమైన సమీక్షకు లోబడాల్సిందే.జర్నలిస్టు ప్రశ్నిస్తే సమాధానం చెప్పాలి.. వార్త తప్పైతే ఖండించాలి.. ఆధారాలు ఉంటే చట్టపరంగా ఎదుర్కోవాలి. కానీ పోలీసు కేసులతో కలం ఆపాలని చూస్తే.. అదే వ్యవహారం అధికార దుర్వినియోగం ఆరోపణలకు దారితీయొచ్చు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే చట్టాన్ని కక్ష సాధింపు కోసం ఉపయోగించారనే ఆరోపణ వస్తే.. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సింది కూడా వారే!

# వరుసగా మూడు పర్యాయాలు టీడీపీ గెలిస్తేనే రాష్ట్రాభివృద్ధి

- **రాష్ట్ర ఐటీ విద్యాశాఖల మంత్రి లోకేష్.**



కుప్పం,ఆగస్టు 22 (జనసంఘర్షణ):

ఆంధ్ర రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతం కావాలంటే వరుసగా మూడుసార్లు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఐటి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విజయనగరం పర్యటనలో భాగంగా శనివారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, కష్టపడి పనిచేసే ప్రతీ ఒక్కరినీ గుర్తించి సముచిత స్థానం కల్పించే బాధ్యత తనదేనని లోకేష్ స్పష్టం చేశారు. విజయనగరం టీడీపీకి కంచుకోట అని, మహనీయుల జన్మభూమి, పైడితల్లి అమ్మవారి పుణ్యభూమి అని కొనియాడారు. కార్యకర్తలు తన వద్దకు రావాల్సిన అవసరం లేదని, కష్టపడే వారిని తానే వెతుక్కుంటూ వస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, సంక్షేమం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై శ్రేణులకు లోకేష్ దిశానిర్దేశం చేశారు. వైసీపీపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ శ్రేణులపై పెట్టిన అక్రమ కేసులన్నింటినీ రద్దు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని ఎద్దేవా చేస్తూ, 'గొడ్డలి పార్టీ' చెప్పేది ఒకటి చేసేది మరొకటని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతం కావాలంటే వరుసగా మూడు పర్యాయాలు టీడీపీ అధికారంలో ఉండాలని ఆకాంక్షించారు. రాబోయే ఎన్నికల కోసం కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా పనిచేసి పార్టీ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో ప్రతిభ చూపిన 100 మంది కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. విజయనగరం ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి నారా లోకేష్ కొనియాడారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిరోజూ నియోజకవర్గ అభివృద్ధి గురించే ఆమె మాట్లాడుతుంటారని, స్వార్థ ప్రయోజనాల కోసం ఎప్పుడూ ఎవరినీ అడగరని చెప్పారు. జీఎంఆర్-మాన్సాస్ ఎడ్యూసిటీ నిర్మాణానికి ఎదురైన అడ్డంకులను అధిగమిస్తూ ప్రాజెక్టును పూర్తి చేయడానికి పట్టుదలతో పనిచేస్తున్నారని తెలిపారు. మన ప్రాంత పిల్లలకు ఏవియేషన్ విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు గజపతి రాజు కుటుంబం 150 ఎకరాల భూమిని ఉచితంగా ఇవ్వడం గర్వకారణమని లోకేష్ ప్రశంసించారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co